


# ఒరు తలై రాగం

ఆర్. శర్మ. దంతుర్తి




ఎప్పటిలాగానే ఆ రోజు కంప్యూటర్ లాబ్‌లో కూర్చుని రికార్డులు దిద్దుతూ ఒక్కొక్క టీమ్‌నీ పిలిచి వాళ్ళు చేసే ప్రాక్టికల్ గురించి అడుగుతున్నాడు ప్రొఫెసర్ రాయుడు. ఉన్న ఎనిమిది టీముల్లో అయిదు టీములయ్యేసరికి రాయుడికి విసుగొచ్చింది. ఎంత చెప్పినా ఈ స్టూడెంట్స్ ఇంతే. అయ్యా, అమ్మా, అర్థమాటిక్ అంతా ఎక్యూములేటర్లోనే తప్ప ఇతర రిజిస్టర్లలో కుదరదనీ చెప్పాడా తాను. ఈ మైక్రోప్రోసెసర్లు ఎంత ఈజీ అర్థం చేసుకోవడం.. కానీ ఈ స్టూడెంట్స్‌కి ఎంత చెప్పినా తలకెక్కినట్టులేదు. ఇలా విసుక్కుంటూ ఆరో టీమ్‌ని పిలిచాడు రాయుడు. అన్యమనస్కంగా ఏవో ప్రశ్నలు వేస్తూ యధాలాపంగా ‘రెండు నంబర్లు ఏడ్ చెయ్యాలంటే ఏ రిజిష్టర్‌లో కుదురుతుంది‘ అనడిగాడు.

సైలెన్స్..

"బి రిజిస్టర్‌లో కుదురుతుందా?"

"నో"

"హెచ్ రిజిష్టరులో కుదురుతుందా?"

"నో"

"నో అనడమేనా లేకపోతే ఏమైనా ఆన్సర్ చెప్పగలరా?"

సైలెన్స్..

ఒక్కసారిగా మొహం కందగడ్డలాగయ్యి అరవడానికన్నట్టు కోపంగా నోరు విప్పబోయేసరికి పక్కనుంచీ ఇలా వినిపించిందో కోకిల కంఠం - "ఎక్యూములేటర్లో?" కొంచెం ప్రశ్నార్థకం జోడించి, సరైన ఆన్సరు రావడంతో ఒక్కసారి చల్లబడి, "కరెక్ట్, కానీ మీకు ఆన్సర్ తెలుసా ఉత్తినే గెస్ చేసారా?" అన్నాడు రాయుడ్ ఆన్సర్ చేసినమ్మాయికేసి తిరుగుతూ.

కిసుక్కుమన్న నవ్వు తరంగాలుగా వ్యాపించి మొదట టీములో అందరూ నవ్వితే, తర్వాత మొత్తం లాబ్ అంతా నవ్వడం మొదలుపెట్టారు. అప్పుడు చూసాడు రాయుడు ఆ సమాధానం కరెక్ట్‌గా చెప్పినమ్మాయికేసి. నోటికి కొంగు అడ్డం పెట్టుకుని రాయుడుకేసి చూసి నవ్వుతోంది. ఆ చూట్టంలో ఆవిడ కళ్ళు జిగేల్‌మని రాయుడ్ని కట్టి పడేసాయి. రాయుడు సడన్‌గా సర్దుకుని మొహంలోకి నవ్వు తెచ్చుకుంటూ తరువాత టీంని పిలిచాడు. కాలేజీ క్లోజ్ చేసాక, రూముకొచ్చాడన్నమాటే గానీ, ఆ కళ్ళు రాయుడిని వదల్లేదు. చెంపకు చారెడేసి కళ్ళున్న ఈ అమ్మాయినెప్పుడూ అంతకు ముందు చూసినట్లు లేదే క్లాసులో... అనుకున్నాడు రాయుడు.

అప్పటినుంచే ఈ అమ్మాయిని స్పెషల్‌గా చూట్టం మొదలుపెట్టేడు... రోజూ క్లాసుకొస్తోందా, చెప్పే నోట్స్‌రాసుకుంటుందా అనే వన్నీ కీన్‌గా అబ్జర్వ్‌చేస్తూ. ఉత్తరోత్తరా ఈ భాగోతంలో రాయుడికి కొన్ని విషయాలు తెలిసాయి. అటెండెన్సు తీసుకుంటున్నప్పుడూ, పేపర్లు దిద్దుతున్నప్పుడూ తనకి తెలియకుండా రాయుడే సంపాదించాడు ఈ విశేషాలన్నీ. పేరు జ్యోత్స్న జోషి, క్లాసుకి రావడానికీ, నోట్స్ రాసుకోవడానికి చాలా శ్రద్ధ చూపిస్తుంది. ఏవరేజ్ స్టూడెంటే కానీ చాలా సిన్సియర్ అమ్మాయి. థర్డ్ ఇయిర్ కనుక ఓ ఇరవై ఏళ్ళుంటాయేమో. అందరి మరాఠీవాళ్ళ లాగానే మొహం మీద బొట్టు మాత్రం తప్పకుండా పెట్టుకుంటుంది. కానీ రాయుడిక్కనిపించేవి ఆ రెండు కళ్ళు. చాలా స్వచ్ఛంగా తన మనస్సు కళ్ళలో ప్రతిబింబిస్తున్నట్లు ఉండే ఆ కళ్ళని చూడ్డానికి మొదట రాయుడు భయపడేవాడు. జోత్స్న చాలా రిజర్వుడ్ పర్సనాలిటి. తానేదైనా అడిగితే, ఆవిడ నోరు విప్పేలోపల ఒక మహా యుగం గడిచిపోతుందనేది రాయుడి నమ్మకం. ఎప్పుడూ జ్యోత్స్నని ఒంటరిగా చూడలేదు రాయుడు. పక్కనొక కల్పనో, ఒక మాధవో ఉండి తీరాల్సిందే బొంబాయిలాంటి మహానగరంలో కూడా ఇలాంటి ఛాదస్తులున్నారన్నమాట అనుకునేవాడు రాయుడు.

ఓసారి ఆఫీస్‌లో కూర్చుని క్లాసుకి ప్రిపేర్ అవుతున్నాడు తాను. అప్పుడు గుమ్మం దగ్గర అలికిడైతే తలతిప్పి చూసాడు రాయుడు. "సార్, పేపర్లు దిద్దేశారాండీ? నాకెన్ని మార్కులొచ్చాయ్?" అనడుగుతోంది మాధవి.

ఎప్పటిలాగానే వెనక షాడో లాగా జ్యోత్స్న. జ్యోత్స్న నోరు విప్పుతుందేమో అని రాయుడు ఎంతగానో అనుకున్నాడు "లేదండి, ఇంకా అన్నీ పూర్తిగా దిద్దలేదు, దిద్దాక చెపుతాను కదా" అన్నాడు రాయుడు. ఆ వారంలో ఖాళీచూసుకుని మళ్ళీ పేపర్లు దిద్దడం మొదలు పెట్టాడు. ఓ పది పేపర్లు దిద్దాడో లేదో పెన్నులో ఎర్ర రంగు రీఫిల్ అయిపోయింది. ఉసూరుమంటూ ఇంకో ఫ్లోర్‌లో ఉన్న రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి రీఫిల్ తెచ్చుకోవడానికి మెట్లు ఎక్కుతూంటే, మళ్ళీ ఈ జంట కనిపించింది. మాధవితో అన్నాడు రాయుడు. "మీకు పద్దెనిమిది వచ్చాయండి ఇరవై అయిదుకి." రీఫిల్ తీసుకుని వచ్చేస్తుంటే, నడక వేగం తగ్గించి చెవులు రిక్కించాడు - జ్యోత్స్న తన మార్కులు అడుగుతుందేమోనని కానీ ఆవిడ నోరు విప్పితేనా!

****************

ఆ ఏడు వేసవి సెలవలకి రాయుడు సొంత ఊరు అమలాపురం వెళ్ళాడు. రాజమండ్రిలో దిగి బస్సెక్కి వెళితే మధ్యాహ్నం రెండు దాటిపోయింది. ఓ వారం రెస్ట్ తీసుకున్నాక వచ్చే సెమిస్టర్‌లో చెప్పబోయే కోర్స్ పుస్తకాలు తీసి నోట్స్ రాసుకోవడం మొదలు పెట్టాడు రాయుడు. ఎంత ట్రై చేసినా రాయుడికి మాత్రం జ్యోత్స్న గురించి ఆలోచనలు వదల్లేదు. ప్రేమో, దోమో తెలియదు గానీ, ఈ మెంటల్ టార్చర్ తర్వాత ఒక్కటి మాత్రం క్లియర్‌గా అర్థం అయ్యింది రాయుడికి - జ్యోత్స్న అంటే తనకి తెలియకుండా ఒకరకమైన ఇష్టం మొదలైయ్యింది. ఓ వారం పోయాక అక్క వచ్చింది, పిల్లల్తో, కాకినాడ నుంచీ తనని చూడ్డానికి. మాటల్లో ఎవరో 'జ్యోత్స్న' అన్నారు, ఏదో పుస్తకం చదువుతూ. ఒక్కసారి సంభ్రమంగా చుట్టూ చూసాడు రాయుడు. "ఏంరోయ్! అలా చూస్తున్నావ్" అనడిగింది అక్క. "అబ్బే, జ్యోత్స్న అని వింటేనూ, దానర్థం ఏమిటా అని ఆలోచిస్తున్నా" అన్నాడు రాయుడు తొట్రుపడుతూ. "జ్యోత్స్న అంటే వెన్నెల.."చెప్పింది అక్క. దాంతో రాయుడి మనస్సులో ఇంకో సమ్మెట దెబ్బ పడింది. ఆ కళ్ళూ, ఆ పేరూ, ఆ పేరుకున్న అర్థం, అన్నీ సరిపోయేలా ఎలాగ కుదిరాయి ఈ అమ్మాయికి?

రోజులు, వారాలు గడిపేసి సెలవలయ్యాక మళ్ళీ బొంబాయి బయలుదేరాడు రాయుడు. ట్రైన్ ఎక్కినప్పటినుంచీ దిగేదాకా ఒకటే ఆలోచన రాయుడికి - ఎప్పుడు జ్యోత్స్నని చూస్తానా అనే. రూమ్‌కి వచ్చాక స్నానం అదీ కానిచ్చి కాలేజీకి బయలు దేరాడు రాయుడు. ఎంత మంది కాంపస్‌లో ఉన్నా రాయుడి కళ్ళు జ్యోత్స్ననే వెతుకుతున్నాయి. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కెళ్ళి తనకొచ్చిన ఉత్తరాలు కలెక్ట్ చేసుకుని లాబ్‌లోకి వెళ్ళగానే అవి ఓపెన్ చేసి చదవటం మొదలు పెట్టాడు. మీ పేపర్ బెంగుళూర్ కాన్ఫరెన్స్‌కి ఏక్సప్ట్ చేసాము కానీ దారి ఖర్చులు మీరే పెట్టుకోవాలి... ఇలా సుత్తి ఉత్తరాల్లోంచీ ఆఖరి ఉత్తరం తీసేసరికి "హల్లో, ఎప్పుడొచ్చారు ఊర్నుంచి?" అని వినిపించింది

పక్కనుంచీ, తలతిప్పి చూసేసరికి నవ్వుతూ కనిపించిందో ఫైనల్ ఇయిర్ అమ్మాయి అనామిక. చాలా ఆశ్చర్యంగా, ఆమె వెనకనే నిల్చునుంది జ్యోత్స్నకూడా. "ఆ, ఈ ... ఈరోజు ఉదయమే దిగాను. రేపటిదాకా క్లాసులు స్టార్టవ్వవు కదా, ఇంతకీ మీరు ఎగ్జామ్స్ అన్నీ బాగా రాసారా, రిజల్ట్స్ ఎప్పుడొస్తాయో తెలుసా?" అనడిగాడు రాయుడు తడబడుతూ. "ఊరుకోండి సార్ ఎంతసేపూ పరీక్షలూ, లేబ్‌లూ తప్ప ఇంకేమీ పట్టవా మీకు? మీ ఊరి గురించి, మీ ట్రిప్పు గురించి చెప్పండి. మీ ఫామిలీ అందరూ బాగున్నారా" అంది అనామిక నవ్వుతూ. కిసుక్కున పక్కనుంచీ జ్యోత్స్న నవ్విన నవ్వు రాయుడి గుండెల్లోంచీ దూసుకుపోయింది. వాళ్ళని కూర్చోమని చెప్పి ఉత్తరాలు పక్కన పడేసి తన ట్రావెల్ గురించి, ఊరు గురించీ ఓ గంట సేపు వివరాలన్నీ చెప్పాడు. ఈ గంటలో ఎన్నిసార్లు రాయుడు జ్యోత్స్న కళ్ళల్లోకి తనివితీరా చూసేడో! వాళ్ళు వెళ్ళిపోయాక లేబ్‌లో కూర్చుని మళ్ళీ ఉత్తరాలు చూడ్డం మొదలుపెట్టాడు. ఎప్పుడో ఆర్నెల్ల క్రితం తను అమెరికన్ యూనివర్శిటీకి అప్లికేషన్ పంపడం నిజమేగానీ దాని సంగతి ఎప్పుడో మర్చిపోయాడు. ఇప్పుడొచ్చింది వాళ్ళ దగ్గరనుంచీ సమాధానం. ఎడ్మిషన్ ప్లస్ మంత్లీ అసిస్టెన్స్ ఇస్తున్నట్లు. రూముకొచ్చిన రాయుడికి ఆ రాత్రి పూర్తిగా నిద్ర కరువైంది.

ఆ తరువాత నాలుగు వారాలు రాయుడు యమయాతన పడ్డాడు. ఈ ఉద్యోగం వదిలేసి అమెరికా వెళ్ళడం ఖాయం. అదికాదు అసలు సమస్య. జ్యోత్స్నని చూడకుండా తాను ఉండగలడా? ఇందులో ఇంకో డైవర్షను. ఎవరీ జ్యోత్స్న? తనకేమౌతుంది? మొన్న మొన్నటి దాకా ఈ అమ్మాయి ఎవరో తనకి తెలియదే. ఏదైనా ఈ విషయం అంత తేలికగా తెమిలేది కాదని అర్థం అయిపోయింది రాయుడికి. ఆ రోజు బస్సులో రూముకొస్తుంటే ఏదో పుస్తకం ఇలా చదివాడు రాయుడు - "ఎంతో మంది కుర్రవాళ్ళు అమ్మాయి ఒప్పుకోదేమో అనే సందేహంతో అసలు అమ్మాయిని అడగనే అడగరు. నిజానికి ఆ అమ్మాయికి ఇష్టమై ఒప్పుకుంటే వంద శాతం అవకాశముంటుంది.. అడక్కపోతే అవకాశం మాత్రం సున్నా. పోనీ ఒప్పుకోకపోయినా, అడగడం వల్ల కనీసం అటో ఇటో తేలిపోతుంది కదా! జీవితాంతం అడక్కుండా ఏడవడం కంటే ఓసారి అడిగేసి అటో ఇటో తేల్చుకోవడం మంచిది." ఇది చదివాక రాయుడికి కాస్త ధైర్యం వచ్చింది. ఈలోపు వీసా రావడంతోపాటు అమెరికా వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఇంకో రెండూ వారాల్లో వెళ్ళిపోతాననగా రాయుడు ఉద్యోగానికి రిజైన్ చేసాడు. ఆ మర్నాడు రాయుడు కాలేజీకి వస్తుంటే అందరూ వింతగా చూట్టం మొదలు పెట్టారు. ఆరోజు క్లాసులో తాను రిజైన్ చేసినట్లూ, అమెరికాకి పి.హెచ్.డికి వెళ్ళిపోతున్నట్టు ఎనౌన్స్ చేసాడు రాయుడు అందరికి. గోలగోలగా స్టూడెంట్స్ వెళ్ళకండి, ఈ కాలేజీలో ఇంకెవరూ బాగా చెప్పరు. మీరు వెళ్ళిపోతే అన్నారు. "బాగుంది, నా సంగతి కూడా ఆలోచించండి మరి, ఎంతకాలం నన్ను ఇలా పాఠాలు చెప్పమంటారు? నేను కూడా స్థిరపడాలి కదా? ఈ బాంబే మహానగరంలో ఇల్లు దొరకడం ఎంత కష్టమో మీకు తెలియంది కాదు. అదీకాక నేను వెళ్ళేది ఉద్యోగం కోసం కాదు. ఇలాంటి అవకాశం వస్తే మీరేం చేస్తారు?" అంటూ అందరితో చెప్పాడు రాయుడు. తన క్లాసులన్నీ అయాక లాబ్‌లో కూర్చుని ప్యూన్‌ని పిలిచి 'ప్రొఫెసర్‌గారు పిలుస్తున్నారని చెప్పి ఓ సారి జ్యోత్స్న అనే అమ్మాయిని పిలు" అన్నాడు.

**********

తాను ముందు అనుకున్నదే అయినా ఇది తనకి కొత్త. అన్నీ ఆలోచించి వచ్చి ఎదురుగా కూర్చున్న జ్యోత్స్నతో ఇలా అన్నాడు రాయుడు. "మీ నాన్నగారు ఏం చేస్తుంటారండీ?" సడన్‌గా వచ్చిన ఈ ప్రశ్నతో ఒక్కసారి ఉలిక్కిపడి, "మా నాన్నగారా? ఎందుకూ?" అంది జ్యోత్స్న తత్తరపడుతూ.

"మీ నాన్నగారు బాంబే యూనివర్శిటీలో ప్రొఫెసర్ అని నాకు ఎవరో చెప్పారు. నాకు యూనివర్శిటీలో చిన్న పని ఉంది." ఈజీగా అబద్దం ఆడేసాడు రాయుడు.

"ఔనండి. నాన్నగారు హిస్టరీ డిపార్టుమెంటులో పనిచేస్తారు."

"ఈ రోజు యూనివర్శిటీకి వెళుతున్నాను. ఓసారి కలిస్తే ఏమీ అనుకోరు కదా?"

"అనుకోరు" అంది జ్యోత్స్న ఇంకా అదోలా చూస్తూ.

"సరే థాంక్స్!" అని రాయుడు యూనివర్శిటీకి బయలుదేరాడు.

యూనివర్శిటీలో జోషీగారిని కలుసుకోవడం అంత కష్టం కాలేదు.. కానీ రాయుడు వెళ్ళేసరికి ఆయన క్లాసులో పాఠం చెబుతున్నారు. అది అయ్యేదాకా ఆగి అయన రూములోకి నడిచాడు రాయుడు.

"నమస్తే. నా పేరు రాయుడు. నేను ఫలానా కాలేజీలో పనిచేస్తున్నాను."

పనిచేసే కాలేజీ పేరు వినగానే "నువ్వేనా నాయనా రోజూ మా అమ్మాయిని చంపుకుతింటున్నావుటా!" అన్నట్లు మొహం పెట్టి "మీ పేరు మా అమ్మాయి దగ్గర విన్నట్లు గుర్తు. చెప్పండి, ఏం కావాలి మీకు" అన్నారు జోషీగారు.

"నాకు అమెరికాలో పి.హెచ్.డీలో సీటు వచ్చింది. నేను ఇంకో రెండు వారాలలో వెళ్ళిపోతున్నాను. ప్రస్తుతం చేసే ఉద్యోగానికి అప్పుడే రిజైన్ చేసాను."

"అయితే ఏమిటంటారు?"

"జోషీగారు, మీతో కాస్త వివరంగా చెప్పాలండి."

ఈసారి కాస్త చిరాగ్గా జోషీ గారన్నారు "నేను ఇక్కడ్నుంచీ ఇంటికి వెళ్ళాలంటే ఈ లోకల్ ట్రైనులో రెండు గంటలు పడుతుంది. ఇప్పుడు బయలుదేరితే రాత్రి ఆరున్నరా, ఏడింటికి చేరగలను. ఏమీ అనుకోకపోతే కాస్త తొందరగా చెప్పు నాయనా"

"అయ్యా నేను మీ అమ్మాయి జ్యోత్స్నని చాలా సైలెంటుగా రెండేళ్ళనుంచీ ప్రేమిస్తున్నాను. చెప్పే ధైర్యం లేక, నాకున్న ఉద్యోగం అంత మంచిది కాదు కనక చెప్పలేదు. ఇప్పుడు అమెరికా వెళ్ళిపోతున్నాను కనక నా అదృష్టం పరీక్షించుకుందామని మీ దగ్గరికి వచ్చాను."

"ఏమిటీ. నువ్వా, మా జ్యోత్స్ననా, ప్రేమిస్తున్నావా?" సడన్‌గా ఏకవచనంలోకి దిగుతూ.

"అవునండి." అన్నాడు రాయుడు గుండె దడదడలాడుతుంటే, ఎక్కడ ఈయన 'నో' అనేస్తాడేమో అని బెదుర్తూ.

ఓ ఐదు నిమిషాలు కన్నార్పకుండా రాయుడు కేసి చూసి, జోషీగారు ఇలా అన్నారు. "చూడు నాయనా మేము బ్రాహ్మలం. మమ్మల్ని చిత్‌ఫవన్ బ్రాహ్మలంటారు. అంటే, చిత్తం పరిశుభ్రమైన బ్రాహ్మలం. మరి నువ్వో? చూడబోతే నువ్వు మద్రాసీలాగా ఉన్నావు. నువ్వు మా అమ్మాయికి ఎప్పుడైనా నీ ప్రేమా, దోమా గురించి చెప్పావా?"

"నేను కూడా బ్రాహ్మణ్ణేనండి. మమ్మల్ని వైదికులంటారు. మీకన్నా మాకు మడీ, ఆచారం ఎక్కువే మాది అగ్రహారంలో నిప్పులు కడిగే వంశం. మీ అమ్మాయితో మాట్లాడ్డానికి ముందు మిమ్మల్ని అడుగుదామని వచ్చాను."

"నువ్వు మా అమ్మాయికి ప్రొఫెసర్ అయిపోయావుగానీ లేకపోతే ఈ పాటికి నీ గూబ పగులగొట్టి ఉండేవాడిని."

"అలా అంటారేంటి సార్! నేనంత వెధవనైతే మీకు చెప్పడానికి ఇంతదూరం వస్తానా? మీకంతగా నమ్మకం లేకపోతే మా కాలేజీలో కనుక్కోండి నా గురించి. నేను ఇక్కడే ఐ.ఐ.టి.లో ఎం.టెక్ చేసాను. అక్కడ్నుంచీ అలా అమెరికా వెళ్ళిపోవాల్సిందే కానీ కొన్ని కారణాల వల్ల ఇలా ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. ఇలా చేరడం మంచికే అనుకోండీ. జ్యోత్స్న నాకు కనిపించింది కదా!"

"ఈ విషయం అంత ఈజీగా తేలిపోయేది కాదు. మా ఆవిడతోటి, అమ్మాయితోటి మాట్లాడనివ్వు. ఈలోపల ఉత్తినే ఆశలేమీ పెంచేసుకోకు, మా ఆవిడ అంత ఈజీగా ఒప్పుకోదు. అసలే నువ్వు మద్రాసీవి. మేమూ, చూడబోతే బొంబాయిలో సెటిలైపోయిన మరాఠీలం."

"అలాగేనండి. జ్యోత్స్న కోసం నేను ఏం చెయ్యడానికైనా సిద్ధమే"

"కొత్తలో అలాగే ఉంటుందిలే. అలాంటి భీకర ప్రతిజ్ఞలెందుక్కానీ, రేపోసారి ఫోన్ చేయ్!"

********

ఇంటికొచ్చిన జోషీగారు కుర్చీలో కూర్చుంటూ, "అమ్మా కాసిని మంచినీళ్ళు తే" అన్నారు.

ఇంట్లో ముగ్గురే, పెద్దమ్మాయి పెళ్ళయ్యాక. ఇదిగో ఈ జ్యోత్స్నకి కూడా చేసేస్తే, తన డ్యూటీ అయిపోయినట్లే. కానీ ఈ రోజు ఈ రాయుడేమిటి జ్యోత్స్నని చేసుకుంటాననడమేమిటి?ఇది కానీ ఆవిడ చెవిన పడిందా, నానాగోలా చేస్తుంది. గొడవలేకుండా ఎలాగ ఈ విషయం కదపడం? పరమేశ్వరా, ఎంత కష్టం తెచ్చావయ్యా!

మంచినీళ్ళ గ్లాసుతో వచ్చిన సంధ్యగారితో "అమ్మాయ్ ఇంకా రాలేదా కాలేజీ నుంచి"? అన్నారు.

"వచ్చింది హోమ్‌వర్కు చేసుకుంటోంది."

"ఓ సారి దాన్ని ఇలా రమ్మను. నువ్వు కూడా ఇలా వచ్చి కూర్చో."

ఇద్దరూ వచ్చి కూర్చుని "చెప్పండి. ఏమిటి సంగతీ" అన్నారు.

"ఈ రోజు జ్యోత్స్న ప్రొఫెసర్ రాయుడు యూనివర్శిటీలో నా ఆఫీసుకొచ్చాడు."

"ఆ.. వెళ్ళేటప్పుడు, నన్ను అడిగారు. ఏదో పని ఉంది. మిమ్మల్ని కలిస్తే పర్వాలేదా అనడిగారు" చెప్పింది జ్యోత్స్న.

"జ్యోత్స్నా, నీతో ఏదైనా చెప్పాడా!"

"లేదే"

"వచ్చింది నీ గురించి మాట్లాడ్డానికే"

"ఏమిటేవిటీ" అన్నారు సంధ్యగారు ఆశ్చర్యంగా.

జోత్స్న కూడా ఆశ్చర్యపోయి, "నా గురించా?" అంది.

"రెండు వారాల్లో అమెరికా వెళ్ళిపోతున్నాట్ట. ఇప్పటిదాకా బాంబేలో సరైన ఉద్యోగం లేదనీ, ఇల్లు దొరకడం కూడా కష్టం అనీ చెప్పలేదట. ఎలాగూ అమెరికా వెళ్ళిపోతున్నాడు కదాని ఇప్పుడు చెప్పాడు. జ్యోత్స్నని రెండేళ్ళనుండీ ప్రేమిస్తున్నాడంట. ఒప్పుకుంటే, వెంటనే పెళ్ళిచేసుకుంటాడట. వీసా రావటానికి ఎలాగా టైమ్ పడుతుంది. ఈ లోపున జ్యోత్స్న డిగ్రీ పూర్తి చెయ్యొచ్చు అన్నాడు."

"వెంటనే గూబ పగలకొట్టక మీరెందుకొప్పుకున్నారూ?" అన్నారు సంధ్యగారు కోపంగా.

"నేనొప్పుకున్నానని ఎవరు చెప్పారు? నాకైతే షాక్‌లోంచి తేరుకోవడానికి టైమ్ పట్టింది. అదీగాక మర్యాదగా వచ్చి అడిగాడు ఎలా చేయి చేసుకుంటాం?"

సంధ్యగారు అమ్మాయ్ వైపు తిరిగి "జ్యోత్స్నా, ఏమిటీ సంగతీ, ఎంతకాలం నుంచీ సాగుతోందిదీ?"

"అమ్మా, నాకేం తెలియదు, నేనెప్పుడూ ఆయన్ని ఒంటరిగా కూడా కలవను. ఇంతకాలం అసలు నాకేమీ చెప్పలేదు. కావలిస్తే మా క్లాస్ మేట్ మాధవికి ఫోన్ చేసి కనుక్కో. నా గురించి నీకు తెలియదా?"

జోషీగారు కలుగజేసుకుని "దాన్నేమీ అనకు. రాయుడే చెప్పాడు. ఇప్పటివరకు అమ్మాయికూడా చెప్పలేదని."

"మరింకేం, ఎలాగూ అమెరికా పోతున్నాడు. పోనివ్వండి. మద్రాసీలతో మనకెందుకు. రేపొద్దున్న అమెరికా తీసుకెళ్ళాక దీన్ని ఎవరికైనా అమ్మేస్తే చూడ్డానికి దిక్కూ మొక్కూ ఉండదు. అయినా మనం బ్రాహ్మలం. వాడో?"

"ఆయన కూడా ఆచారవంతులైన బ్రాహ్మలే అని నాతో చెప్పాడు."

"చెప్పడానికేం. మనం మద్రాసెళ్ళి చూసేదా, తీర్చేదా"

"సరే ఐతే, అమ్మా జ్యోత్స్నా నువ్వేమంటావ్? రేపు ఫోన్ చేస్తానన్నాడు. ఏదో చెప్పాలి కదా. ఉత్తినే ఆశలు పెంచుకోకూ అని చెప్పాననుకో"

"మీ ఇష్టం నాన్నగారూ, కానీ పుల్ల విరుపుగా చెప్పేస్తే, కాలేజీలో నా రికార్డ్స్ పాడుచేస్తారేమో? అసలే అమెరికా వెళుతున్నారు కదా, కొంచెం నెమ్మదిగా చెప్పటం మంచిదేమో?"

"ఏంటీ వాడు పాడు చేసేది" అని సంధ్యగారంటే,

"రికార్డ్సు పాడు చేయడానికి ఛాన్సు ఉంది కానీ అలా చేస్తాడని నేననుకోను. అయినా మన జాగ్రత్తలో మనం ఉండటం మంచిదే" అన్నారు జోషీగారు.

మర్నాడు రాయుడు గుండెలదురుతూంటే కాలేజీలో అడుగు పెట్టాడు. జ్యోత్స్న కనిపిస్తే మొహం చూపించాలి కదా! సాయంకాలానికి మళ్ళీ జోషీగారికి ఫోన్ చేసాడు.

"నమస్తే, నేను రాయుడ్ని మాట్లాడుతున్నాను. మీ ఫామిలీతో మాట్లాడారా?"

"ఆ మాటాడాను. మాకిదంతా చాలా కన్ఫ్యూజింగా ఉంది. ఒక్క రోజులో చెప్పడం కష్టం. ఎలాగూ రెండు వారాల్లో నువ్వు అమెరికా వెళ్ళిపోతున్నావు. ఈ రెండు వారాలు ఆలోచించుకుని నువ్వెళ్ళేలోపు చెపుతాము. ఏమంటావు?"

"తప్పకుండా. కానీ నన్ను నిరాశ పరచనని చేయనని ప్రామిస్ చేయండి." అన్నాడు రాయుడు నవ్వుతూ.

"నేను చేయలేను అలాంటి ప్రామిస్‌లు. అయినా నువు ప్రపోజ్ చేసేది నాకా, మా అమ్మాయికా?" అన్నాడాయన తాను కూడా నవ్వుతూ.

ఫోన్ పెట్టేసి రాయుడు ఆలోచన్లో పడ్డాడు, తాను తప్పు చేసాడా? జ్యోత్స్న తనని రిజక్ట్ చేస్తే తాను అమెరికా వెళ్ళి మామూలుగా బతగ్గలడా?

ఆ తరువాత రోజుల్లో రాయుడు కాలేజీకెళ్ళాడు. కానీ చిత్రంగా జ్యోత్స్న ఒక్కసారి కూడా కనిపించలేదు రాయుడికి. షాపింగ్ గొడవలతో, రూము ఖాళీ చేయడంలో, సామాను సర్దడంతో రాయుడికి తిండి, నిద్రా లేకుండా రెండు వారాలు గడిచిపోయి, వెళ్ళవలసిన రోజు దగ్గరకొచ్చింది. ఏరోజుకారోజు చూస్తున్నాడే కానీ జోషీగారి దగ్గర్నుంచి ఏమీ సమాధానం రాలేదు. మనస్సుండబట్టక వెళ్ళిపోయే ముందు రోజు జోషీగారికి మళ్ళీ ఫోన్ చేసాడు రాయుడు వణుకుతున్న చేతుల్తో.

"ఇంకా ఓ రోజుంది కదా" అన్నాడాయన తేలిగ్గా. "అమ్మాయ్ తప్పకుండా చెపుతుందిలే"

ఆ రోజు రాత్రి రెండింటికి తన ఫ్లైట్. సాయంకాలం మళ్ళీ ఇంకోసారి జోషీగారికి ఫోన్ చేసాడు.

"ఆ, నేనే చెపుదామనుకున్నాను. కానీ అమ్మాయ్ ఎయిర్‌పోర్ట్‌కి వస్తానంది. నిన్ను అక్కడ కలుస్తాం రాత్రి." అన్నారు జోషీగారు.

"సరే సర్!" అని ఫోన్ పెట్టేశాడు రాయుడు. ఇది నమ్మ బుద్ది కావట్లేదు. ఎప్పుడూ తనతో మాట్లాడని జ్యోత్స్న ఈ రోజు ఎయిర్ పోర్ట్‌కొస్తుందా? వచ్చి ఏం చెబుతుంది? నోరు విప్పుతుందా అసలు లేకపోతే అందరి ముందు ఈ జోషీగారు తనని చెప్పు తీసుక్కొడతాడా? ఏదైనా, తాను చేసిన పెద్ద తప్పేమిటి? మర్యాదగా వెళ్ళి అడిగాడు. చూద్దాం ఏమవుతుందో, అనుకుంటూ ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాడు రాయుడు. లగేజ్ చెకింగులో ఇచ్చాక బయటికొచ్చి విజిటర్ లాంజ్‌లో చూస్తూ కూర్చున్నాడు రాయుడు. తొమ్మిది, పది అవుతున్నా జోషీగారు గానీ, జ్యోత్స్న గానీ వచ్చే జాడలు కనపడలేదు. ఆఖరి బోర్డింగ్ ఎనౌన్స్‌మెంట్ వచ్చేదాకా చూసి, లోపలకి నడిచాడు రాయుడు. పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేయించుకుని లోపలికెళుతుంటే, "మీకు జోషీగారు బాగా తెలుసా?" అన్నాడు పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేసిన క్లర్క్ రాయుడితో.

ఒక్కసారి గతుక్కుమని "లేదే జోషీగారమ్మాయ్ నా స్టూడెంట్" అన్నాడు రాయుడు.

"ఈ ఉత్తరం మీరు అమెరికా వెళుతున్నందుకు మీకిమ్మంది జ్యోత్స్న. నేను దాదర్‌లో జోషీ గారి ఇంటికెదురుగా ఉంటాను. మేము దాపు ఇరవై ఏళ్ళ నుండీ స్నేహితులం. బోన్ వాయేజ్ అండ్ గుడ్ లక్!"

"ఓ మేనీ థాంక్స్!" అన్నాడు రాయుడు ఆ కవర్ అందుకుని ప్లేన్ ఎక్కడానికి ముందుకి నడుస్తూ.

లైన్లో నుంచున్నాడన్నమాటే గానీ రాయుడి దృష్టంతా చేతిలో కవర్ మీదే ఉంది. తన పేరు జ్యోత్స్న రాసిందేనని తెలుస్తోంది. ఈ మూడేళ్ళ కాలంలో తాను ఎన్నిసార్లు జ్యోత్స్న హాండ్ రైటింగ్ చూశాడో. కానీ చేతిలో కవర్ మాత్రం ఓపెన్ చేయడం కుదిరింది కాదు - ముందూ వెనకా జనం ఉన్నారు. ఓపెన్ చేస్తే లైనులో నించున్న అందరికీ కనపడే ఛాన్స్ ఉంది.

ఇంకో అరగంటకి కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకున్నాక, రాయుడు ఆత్రంగా కవర్ ఓపెన్ చేసాడు. అందమైన కార్డులో "బెస్ట్ విషెస్ ఫర్ యువర్ అమెరికన్ ట్రిప్" అనే దానికింద "జ్యోత్స్న" అనే సంతకం. అందులోని ఒక ఉత్తరం రాయుడి ఒళ్ళో పడింది. ఓపెన్ చేసి మెల్లిగా చదవటం మెదలుపెట్టాడు.

"నమస్తే, మీరు అమెరికా వెళ్ళిపోతున్నారని అన్ని క్లాసుల్లో చెప్పుకున్నారు. కాలేజీలో అందరికీ చెప్పుకున్నారు. మా నాన్నగారి దగ్గరికి వెళ్ళి మరీ చెప్పుకున్నారు. నన్ను ప్రేమించారని నాన్నగారితో చెప్పారు కదా. కానీ నాతో ఏమీ చెప్పలేదే? సిగ్గా? మరి మీ లాబ్‌లోకి రాగానే ఎంత సేపూ నా కళ్ళల్లోకి చూడ్డమే తప్ప ఇంకేం చెయ్యరే? నేను మాట్లాడాలని రెండు మూడు సార్లు ప్రయతం చేస్తే మీ దగ్గరికి రాగానే మీరు సుత్తి కొట్టేసారు. నన్ను నోరు విప్పనివ్వరే! ఎంత ప్రొఫెసర్ అయితే మాత్రం మరీ ఇంత వాగుడు పనికిరాదు కదా! ఓ సారి నేను, అనామిక కలిసి లాబ్‌కి వచ్చాము మీరు వేసవి శెలవుల నుంచీ రాగానే. ఆ రోజు అసలు మీ దగ్గరకు వచ్చింది కొంచెం మీ గురించి తెలుసుకుని, మా ఫామిలీ గురించి చెబుదామనే. నా బెరుకు చూసి అనామికే మొదలు పెట్టింది మాట్లాడ్డం. కానీ మేం అడగ్గానే మీరు సుత్తి మొదలుపెట్టారు. నాన్నగారి దగ్గరకు వెళ్ళేటప్పుడు ఎందుకో నాకెందుకు చెప్పలేదు? పైగా యూనివర్శిటీలో పని అని అబద్ధం ఆడేసారు నాతో. నేను కూడా అంత పెద్దగా అందరితో కలవలేనని ఒప్పుకుంటాను. మీరు మొదటిసారి స్టేక్ గురించీ, రికర్షన్ గురించీ క్లాసులో చెప్పినప్పటినుండీ మిమ్మల్ని చూస్తున్నాను. ఇంకో ప్రొఫెసర్ కూడా చెప్పారు రికర్షన్ గురించి వేరే క్లాసులో. ఏమీ అర్థం కాలేదు; మళ్ళీ మీరు చెప్పేదాకా. భలే ఈజీగా చెప్పారే అనిపించింది. అప్పటినుంచే మీరంటే ఇష్టపడడం మొదలైందనుకుంటా. మీరు వెళ్ళిపోయే ఈ రెండు వారాల్లో నేనెంత బాధపడ్డానో మీకేం తెలుసు? కాలేజీకి రావడం కూడా మానేసాను. నేనీ రెండు వారాల్లో పడ్డ యాతన మీకర్థం అవ్వాలనే, చివరి వరకు ఏమీ చెప్పకుండా, ఆఖరికి ఎయిర్‌పోర్ట్‌కి కూడా రాకుండా ఇలా ఉత్తరం పంపిస్తున్నాను.

మీరు నాన్నగారి దగ్గర మాట్లాడిన విషయం విని అమ్మకూడా మనిద్దరి మధ్య ఏదైనా కథ నడుస్తుందనుకుంటోంది. వెంటనే వద్దు అని చెప్పేయమంది. కానీ నేను 'వద్దని చెపితే నా కాలేజీ రికార్డ్స్ మీరు పాడు చేస్తారేమో' అని చెప్పి వారించాను. నాతో మాట్లాడితే, వెంటనే నా కూడా మా ఇంటికి తీసుకెళ్ళి అందర్నీ పరిచయం చేసి ఉండేదాన్ని కదా! గోటితో పోయేదానికి గొడ్డలి దాకా తెచ్చారు. ఈ ఉత్తరం మా అంకుల్ ద్వారా పంపిస్తున్నాను. ఇందులో ఫ్రెండ్ ఎడ్రస్ ఇస్తున్నాను. మీరు అమెరికా నుండి ఈ ఎడ్రస్‌కి ఉత్తరం రాస్తూ యూనివర్శిటీ నుండి ఓ అప్లికేషన్ పంపించండి నాకు. నేను కూడా ఎగ్జామ్స్ రాసి అక్కడికి రావడానికి ప్రయత్నం చేస్తాను. మీరు కొంచెం వాగుడు తగ్గించి అవతల వాళ్ళు చెప్పేది వినడం నేర్చుకోండి. మీరడిగిన ప్రశ్నకి స్టూడెంట్స్ ఆన్సరు వెంటనే చెప్పకపోతే అంత గబుక్కున వచ్చేస్తుందే మీకు కోపం? మీలాగా మేము ఐ.ఐ.టిలో చదువుకున్నామా ఏమిటి? నేను అమెరికా వచ్చేలోపున మీరు ఇవన్నీ ఇంప్రూవ్ చేసుకుంటారని ఆశించొచ్చా? నాన్నగారు 'అమ్మా నువ్వేమంటావు' అని అడిగారు. నా ఉద్దేశ్యం మీకు డైరెక్టుగా చెపుతానని నాన్నగారు చెప్పారు కదా. ఇంకేం ఉంది చెప్పడానికి? నా క్లాస్మేట్ మాధవి గుర్తుందా మీకు? దాని ఇంటి పేరు 'నటరాజన్'. చాలాకాలం క్రితం మద్రాస్ నుంచీ బాంబే వచ్చి సెటిల్ అయ్యారు. మాధవి మనిద్దరికీ పెట్టిన నిక్‌నేమ్ - 'ఒరు తలై రాగం.' నన్ను ఏడిపించి చంపుకు తినేది మీరు కాలేజీలో కనిపించగానే. ఇద్దరికీ ఒకే నిక్‌నేమ్ ఎలాగ కుదురుతుందో ఎప్పుడూ అర్థం కాలేదు నాకు. ఇప్పటిదాకా ఎంత అడిగినా 'ఒరు తలై రాగం' అంటే అర్థం చెప్పలేదు. నాకా తమిళం రాదాయె! ఈ ఉత్తరం రాస్తుంటే ఇప్పుడే వచ్చింది. 'ఒరు తలై రాగం' అంటే అర్థం చెప్పి పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతోంది. మనిద్దరం కూడా ఈ రెండు మూడేళ్ళు నోరు మెదపకుండా ఈ

నిక్‌నేమ్‌కి తగినవాళ్ళమే అని నిరూపించాం. ఈ ఉత్తరం రాయడం అవ్వగానే దాని నెత్తి మీద మొట్టికాయలు వేసి నోరు మూయించాలి. వెళ్ళాక ఉత్తరం రాస్తారు కదూ?.... జ్యోత్స్న."

ఉత్తరం చదవడం పూర్తవగానే, రాయుడు రెండు చేతులు ఒక్కసారి గాల్లోకి విసిరి కంచుకంఠంతో బిగ్గరగా "యా...హూ!" అని అరిచాడు. రాయుడి పక్కనే కూర్చున్న జర్మన్ దేశస్తుడు మాత్రం ఒక్కసారి బిత్తరపోయి "ఓ, ఆర్యూ ఓ.కే" అనడిగాడు.

రాయుడు బిగ్గరగా నవ్వుతూ "యా, యా, అయాం డబల్ ఓ.కే" అన్నాడు.

(ఒరు తలై రాగం - ఒక తమిళ సినిమా పేరు - అర్థం - "వన్ సైడెడ్ లవ్." ముక్కస్య ముక్కార్థం చెప్పుకుంటే``ఒకే తలకాయ పాట` అనొచ్చేమో)

పరిత్యాగం (డిస్-క్లైమర్):- ఇది కథ మా..త్ర...మే. పేర్లు కానీ, సిటీలు కానీ, ఉద్యోగాలు కానీ మేచ్ అయితే - మీకు కానీ, మీ బంధుమిత్రులకు కానీ, మీకు తెలుసున్నవాళ్ళకు కానీ - అది పూ..ర్తి...గా.. `కోఇన్సిడెన్స్.` గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకోనవసరం లేదు.

